క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) : మండలంలోని నెల్లేపల్లి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారని ఎంపీడీఓ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి, అమలు, ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

21 నుంచి ఈశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌బాబు

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా ఆదేశాల మేరకు ఈ ఏడాది అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల ఆలయం చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో ఈసారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని గుడి చుట్టూ నిర్వహించి, అనంతరం పట్టణ పురవీధుల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉభయదారులు తమవంతు సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్వేతకుమారికి మహిళా శాస్త్రవేత్త అవార్డు


కె.శ్వేతాకుమారి

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో ఇంక్యుబేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె.శ్వేతకుమారికి న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ) మహిళా శాస్త్రవేత్త అవార్డు ప్రకటించింది. స్టడీస్ టూ ఎక్స్‌ప్లోర్ ది మెకానిజం ఆఫ్ ప్లాంట్ హర్బివర్ ఇంటరాక్షన్ ఆల్టర్డ్ బై పారాసోడిస్ అండ్ పోలిడనవైరస్ అనే అంశంపై ప్రాజెక్టు మంజూరైనట్లు బయో సైన్స్ సెరికల్చర్ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డీఎం.మమత తెలిపారు. బయో సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు కె.శ్వేతకుమారికి రూ.26 లక్షలు డీఎస్‌టీ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ధర్మ, భక్తి, జ్ఞానమార్గాలు మోక్షానికి దిక్సూచికలు


రామకృష్ణ మిషన్ వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి రాణి సదా శివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ భగవంతుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శ్రీ శారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు. డాక్టర్ పీసీ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ రామకృష్ణ ఆధ్యాత్మికతను, ఆధ్యాత్మిక యాత్రను, ఆయన సేవను మహాత్మా గాంధీ కొనియాడిన విధానాన్ని తెలియజేశారు.

వీసీఈఏ జిల్లా అధ్యక్షులుగా పద్మజ

తిరుపతి రూరల్: విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(వీసీఈఏ) తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఏజీ పద్మజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి యూత్ హాస్టల్లో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు దేవేంద్రనాథ్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలకు అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా ఏజే పద్మజ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బీవీ పద్మజ, ప్రధాన కార్యదర్శిగా జానకీ రామిరెడ్డి, కోశాధికారిగా సుబ్బరాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్, మహిళా కార్యదర్శిగా కల్పన ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.

సండే సందడి

పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వేసవి సెలవులు కాస్త ఉపశమనం. నిత్యం పుస్తకాలతో సతమతమయ్యే చిట్టిబుర్రలకు కాస్త రిలీఫ్ దొరికింది. ప్రస్తుతం వేసవి సెలవులు ప్రారంభం కావడంతో పుత్తూరులోని వైఎస్సార్ మున్సిపల్ పార్క్ ఆటవిడుపుగా మారింది. నిత్యం ఉదయం, సాయంత్రం పిల్లలతో నిండిపోతోంది. ఆదివారం అయితే పిల్లలతో పాటు పెద్దలు సైతం పార్కులో సందడి చేస్తున్నారు.

- ఆహ్లాదాన్ని పంచుతున్న పుత్తూరులోని వైఎస్సార్ పార్కు
- వేసవి సెలవులు కావడంతో సందడి చేస్తున్న జనం
- పుత్తూరులోనే మరో రెండు పార్కుల ఏర్పాటుకు మంత్రి రోజా చొరవ
- ఇటీవలే స్థల పరిశీలన చేసిన తుడా యంత్రాంగం



జాలీగా జిమ్ చేస్తున్న యువత, (ఇన్‌సెట్) పార్కులో పిల్లల ఆటల జోరు


పార్కులో ప్రత్యేక ఆకర్షణగా వైఎస్సార్ విగ్రహం

పుత్తూరు రూరల్: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మున్సిపల్ నిత్యం జనంతో కళకళలాడుతోంది. వ్యాయామం చేసుకునే వారితో, వాకింగ్ చేసుకునే వారితో పిల్లలతో సందడి వాతావరణం నెలకొంటోంది. గత ఏడాది మార్చి 18న ప్రారంభమైన ఈ పార్కు పట్టణ ప్రజలకు కొత్త అనుభూతులను కలిగిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టణ ప్రజలు సండే సరదాలను తీర్చుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా చొరవతో పుత్తూరులో తొలి పార్కు ఏర్పాటైంది. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి సరదాగా గడుపుతున్నారు. ప్రతిరోజూ కంటే భినంగా ఆదివారం రోజున పిల్లలతో కలిసి పెద్దలు రావడంతో పార్కు కోలాహలంగా ఉంటోంది. ప్రత్యేకించి ఇటీవలే రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా 16 ఐమాక్స్ లైట్స్‌ను మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో కొత్త వెలుగుల్లో పార్కు కాంతులీనుతూ పిల్లలను, పెద్దలను ఆకర్షిస్తోంది. ఫలితంగా పెద్దలు పచ్చని మొక్కల మధ్యన సేద తీరుతుండగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో పిల్లలు ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుతున్నారు. కొంతమంది యువకులు జిమ్ చేస్తుండగా, మరికొందరు వాకింగ్ ట్రాక్‌పై నడుస్తూ చల్లటి గాలిని ఆస్వాదిస్తూ సండేని సరదాగా గడిపేస్తున్నారు.

పుత్తూరులో మరో రెండు పార్కులు..

పుత్తూరు పట్టణ ప్రజల అవసరాల నిమిత్తం మున్సిపాలిటీ పరిధిలో మరో రెండు పార్కులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆర్కే రోజా నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా తుడా చైర్మన్‌తో పాటు అధికారులతో సంప్రదింపులు జరిపారు. దీంతో పార్కులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇటీవలే తుడా వైస్ చైర్మన్ ఎస్.హరికృష్ణ పట్టణంలోని స్థలాలను పరిశీలించారు. 10వ వార్డు గోవిందపాళెం లెక్క దాఖలాలో 2.5 ఎకరాల్లో మున్సిపల్ పార్కు, 24వ వార్డుకు చెందిన కాపు వీధి సమీపంలో 0.59 సెంట్లలో మినీ పార్కు ఏర్పాటుకు గల అవకాశాలపై సమీక్షించారు. సదరు స్థలాలకు సంబంధించి స్థానిక మున్సిపల్ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. దీంతో పుత్తూరులో మరో రెండు పార్కులు ఏర్పాటు అవుతాయనడంలో సందేహం లేదు. 60 వేల పట్టణ జనాభాకు అనుగుణంగా పార్కుల ఏర్పాటుకు స్థానిక మంత్రి ఆర్కే రోజా చొరవ చూపడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈశ్వరాలయానికి మంత్రి రోజా విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- ప్రదోష నంది వాహనం, ఉత్సవమూర్తుల ఏర్పాటు కోసం..
- రూ.2.50 లక్షలు అందజేసిన మంత్రి
- హర్షం వ్యక్తం చేసిన ఆలయ పాలక మండలి సభ్యులు

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయానికి విరాళంగా రూ.2.50 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ఈ మొత్తంతో ప్రదోష నంది వాహనం, ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ప్రదోష పూజల సమయంలో నంది వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించడం ద్వారా భక్తుల కోరిక నెరవేరినట్లు అవుతుందని తెలిపారు. అయితే మంత్రి రోజా సాయం అందించడంపై పాలకమండలి సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, సభ్యులు బాబు, రమేష్, సుందరం, చిట్టిఆచారి, శివ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి స్పందన


క్యాన్సర్ మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

వడమాలపేట : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడమాలపేట బాలుర పాఠశాల ఆవరణలో మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో తిరుపతి టాటా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అందువల్ల గ్రామీణ ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. ఈ వ్యాధి 3 దశల్లో వ్యాప్తి చెందుతుందని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారించుకోవచ్చన్నారు. పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాల వల్లక్యాన్సర్ ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన లేక వ్యాధి బారిన పడతున్నారని తెలిపారు.

సౌకర్యాల పరిశీలన..

అనంతరం రోగులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా అని మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి శిబిరానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వైద్యసిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రోజా సహకారంతో తిరుపతి స్విమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పింక్ బస్సును ప్రవేశపెట్టి గ్రామాల్లో ఉచిత మెడికల్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. టాటా ట్రస్టు వారు తిరుపతిలో అన్ని సౌకర్యాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, జిల్లా బీసీ కార్యదర్శి సదాశివయ్య, కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ ధర్మయ్య, వెంకటరెడ్డి, ఆనందయ్య, మెడికల్ క్యాంపు పీఆర్వో లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


యుద్ధ సన్నివేశంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

కార్వేటినగరం: మండల పరిధిలోని అమ్మపల్లి వద్ద నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురరవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధన వధ ఘట్టం చూపరులను ఆకట్టుకుంది. భీముడు గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని బయటకు రప్పించే ఘట్టం చూపరులను కట్టి పడేసింది. అదేవిధంగా దుర్యోధునుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అనంతరం భీముని వేషధారి దుర్యోధనున్ని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండ ప్రవేశ భక్తులు పూలమాలలు ధరించి, వేపాకులు చేతపట్టారు. భక్తుల గోవింద నామస్మరణాలతో ఆలయ ఆవరణ మార్మోగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ నిర్వాహకులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీధి విక్రయదారుల సంఘం ఏర్పాటు



వరప్రసాద్, ఎం.అంకయ్య(చిన్న)

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణ వీధి విక్రయదారుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి ఆదివారం తెలిపారు. సంఘ అధ్యక్షుడిగా బి.వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటరమణ, కార్యదర్శిగా ఎం.అంకయ్య(చిన్న), కోశాధికారిగా ఎస్.రాజేంద్రనాయుడు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.మునిరత్నం, హెచ్.ముత్తురామన్, ఎం.తులసినాథ్, జి.లావణ్య, కె.ప్రసాద్, కె.జయ, ఎస్.మునియమ్మ, ఎస్.నీలా, టీఆర్ లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. పలు సమస్యల పరిష్కారం కోసమే వీధి విక్రయదారులు సంఘం ఏర్పాటు చేశామని, ఆ దిశగా కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం


సమావేశమైన విశ్రాంత ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 1998–2003 కాలంలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన శంకర్ నాయుడు ఉపాధ్యాయ బృందం ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రస్తుత ఎంఈఓ తిరుమలరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావంతో పని చేసి ఉద్యోగ విరమణ చేయడం జీవితంలో గొప్ప మలుపని అన్నారు. శేష జీవితాన్ని ఆరోగ్యవంతంగా ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఒకరినొకరు కుశల ప్రశ్నలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓలు యుగంధర్‌రాజు, కేశవులురెడ్డి, ఉపాధ్యాయినులు హరిత, మనోహరి, పుష్ప, హేమలత, మీరా తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త


మాట్లాడుతున్న శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: భగవంతుని దృష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమాయ్య గొప్ప సామాజిక వేత్త అని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ అన్నమయ్య– సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. ఆయన పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు వంటి అంశాలను తెలియజేశారని తెలిపారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పని చేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార తదితర వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించామని గుర్తు చేశారు. బెంగళూరుకు చెందిన అచార్య జీఎస్.మోహన్ అన్నమయ్య –పురందరదాసులు అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దిరి సంకీర్తనలు జానపద శైలిలో , సామాన్యప్రజలకు అర్థమయ్యేలా ఉంటాయన్నారు.

‘గడపగడపకు’ నిర్వహణపై మంత్రి సమీక్ష


బలరామరాజు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణపై స్థానిక నాయకులతో చర్చించారు. కోణంగిపల్లె గ్రామంలో ఆలయ నిర్మాణంపై అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా అగ్గిచేనుపల్లె గ్రామంలో ఎంపీటీసీ చిన్నబ్బ సోదరుడు మునస్వామి(62) అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో పర్యటించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆయన మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సమీపంలోని ఒంటిళ్లకు చెందిన మోహన్ రెడ్డి కొడుకు బారసాల కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర రెడ్డి, గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సీనియర్ నాయకులు పేట ధనుంజయరెడ్డి, నరేష్‌రెడ్డి, పచ్చికాపల్లం ఉప సర్పంచ్ ఈశ్వరరెడ్డి, పరమేశ్వర రెడ్డి, భూపాలయ్య ఉన్నారు.

బలరామరాజు సేవలు మరువలేనివి

కార్వేటినగరం: విశ్రాంత తహసీల్దార్ బలరామరాజు(85) సేవలు మరువలేనివని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న బలరామరాజు ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కార్వేటినగరంలోని వారి స్వగృహానికి చేరుకుని విశ్రాంత తహసీల్దార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బలరామరాజు కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. అలాగే ఆయన బుద్ధిమాంద్య స్వచ్ఛంద సేవాసంస్థ ఏర్పాటు చేసి సేవలు అందించారని, ద్రౌపదమ్మ ఆలయం అధ్యక్షుడిగా ఆలయ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అదేవిధంగా ఎంపీపీ లత, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉప సర్పంచ్ శేషాద్రి, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సుబ్రమణ్యస్వామి ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామరాజు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

‘అల్లూరి’ పేరిట అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పోరాట యోధుడు అల్లూరి స్ఫూర్తితో నేటి యువత సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అగ్రవర్ణానికి చెందిన రాజుల్లోనూ పేదవారు ఉన్నారని అలాంటి వారి కోసం ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘ నాయకులు సురేష్‌రాజు, మురళిరాజు, శివరాజు, ఉపేంద్రరాజు, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.శంకర్, ఎంఎల్‌ఓ సీఎం దిలీప్‌మొదలి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లండన్ కౌన్సిల్ సభ్యుడిగా పుత్తూరు వాసి ఎన్నిక


బ్రాక్‌వెల్ ఎన్నికల్లో గెలుపొందిన మహ్మద్ నాజర్ (పచ్చ కోటు ధరించిన వ్యక్తి)

పుత్తూరు రూరల్: లండన్ దేశంలోని చెందిన బ్రాక్‌వెల్ నగరంలో ఈనెల 4వ తేదీన జరిగిన ఎన్నికల్లో పుత్తూరుకు చెందిన యువకుడు మహ్మద్ నాజర్ విజయం సాధించాడు. స్థానిక షాపువీధికి చెందిన వ్యాపారి జహురుద్దీన్ కుమారుడైన మహ్మద్ నాజర్ 15 ఏళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా లండన్ వెళ్లాడు. ఆదేశ పౌరసత్వం లభించడంతో ఈనెల 4వ తేదీన జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాడు. పుత్తూరుకు చెందిన యువకుడు బ్రిటన్ గడ్డపై ప్రజాప్రతినిధిగా ఎంపిక కావడం పట్ల ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అతని తండ్రి జహురుద్దీన్, బావ వహీద్ అహ్మద్, లతీఫ్, రబీబుల్లా, హమీద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా చెవుటి గంగమ్మ కొలుపు


ప్రత్యేక అలంకరణలో చెవుటి గంగమ్మ అమ్మవారు, పాలు, పసుపు బిందెలను తీసుకొస్తున్న భక్తులు, అమ్మవారిని దర్శించుకుని అంబలిని స్వీకరిస్తున్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ అమ్మవారి కొలుపు మహోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఉదయం అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు ప్రతి ఇంటి నుంచి అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో గ్రామంలో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అర్చకులు మహిళలు తెచ్చిన పాలు, పసుపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు అంబలిని పంపిణీ చేశారు. అమ్మవారి కొలుపు మహోత్సవానికి తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల భక్తులు భారీగా రావడంతో ఆలయం కిటకిటలాడింది.

పార్టీ కోసం కష్టపడిన వారిని ఆదుకుంటాం

- డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి


చిరంజీవి నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎళ్లవేళలా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆదివారం వనదుర్గాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి నాయుడు కర్మక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి నాయుడు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తాము ఎళ్లవేళలా అండగా ఉంటామనిహామీ ఇచ్చారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మాలో మాకు విభేదాలు సృష్టించేలా విద్వేషపూరితమైన వార్తలు రాయడం హేయమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండడంతో టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలకు తెరలేపారని దుయ్యబట్టారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ప్రజల మధ్యకు వెళ్తుంటే ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్నుళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, సుందరరాజు, నరసింహ నాయుడు. చంద్రశేఖర్ రాజు, పుత్తూరు కేశవరెడ్డి, సర్పంచ్ అయ్యప్ప, నరసింహరాజు, గోపి, సిద్దమందడి, వరదరాజు, రవిరెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కత్తెరపల్లి విద్యార్థుల ప్రభంజనం

కార్వేటినగరం: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 77.38 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ విజయకుమార్ ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం పదో తరగతి విద్యార్థులు 411 మంది పరీక్షలు రాయగా అందులో 308 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. మండలంలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా మొత్తం 67 మంది పాస్ అయ్యారని తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయిసౌమ్య, జశ్వంత్ అధిక మార్కులు సాధించినట్లు చెప్పారు. వసతిగృహంలో ఉంటూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిగా జశ్వంత్ నిలిచినట్లు బీసీ వసతి గృహం వార్డెన్ కుప్పస్వామి తెలిపారు. అలాగే కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో 500 మార్కులపైగా సాధించిన వారు సుమారు 20 మంది ఉన్నారని ఆ పాఠశాల హెచ్‌ఎం కే.హేమారెడ్డి తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ, ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కార్వేటినగరం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ దస్తగిరి కథనం మేరకు వివరాలు ఇలా.. మండలంలోని సీకాయ పట్టడి గ్రామానికి చెందిన జయపాల్‌రెడ్డి (44) మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో భాగంగా ఆదివారం పళ్లిపట్టు నుంచి కార్వేటినగరం వైపు చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మనిషిని ఢీకొట్టి వెళ్లిపోయిన వాహనం కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.